17న మేయర్ దంపతుల హత్యకేసు విచారణ

చిత్తూరుఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన నగర మేయర్ దంపతుల జంట హత్యల కేసు విచారణ ఈనెల 17న ప్రారంభం కానుండటంతో జరిగిన సంఘటనపై చిత్తూరు మునిసిపల్ కార్యాలయాన్ని డిఫెన్స్ న్యాయవాదులు పరిశీలించారు. దివంగత మేయర్ అనురాధ ఛాంబర్‌తో పాటు కౌన్సిల్‌హాల్, మునిసిపల్ కార్యాలయ పరిసరాలను డిఫెన్స్ న్యాయవాదులైన కే.జితేంద్ర, ఎం.చైతన్య కుమార్, డి.విజయచంద్రారెడ్డి, గిరిధర్ శర్మ, కేపి.కుమార స్వామి, తోటా పురుషోత్తం, బాలాజీ పరిశీలించారు.

జగన్ రెడ్డి కట్టింగ్‌ల ముఖ్యమంత్రి

- **దళితులకు మెరుగైన టెక్నాలజీతో తమ ప్రభుత్వమే ఇళ్లుకట్టిస్తుందని హామీ**

మహిళా కూలీలతో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి- పిచ్చాటూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 20వ రోజు సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలంలోని కీళ్లపూడి గ్రామం నుంచి ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం 1.40గంటలకు వెంకటరెడ్డి కండ్రిగలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. సాయంత్రం 6.35 గంటలకు సదాశివపురంలో స్థానికులతో లోకేష్ మాటామంతీ నిర్వహించారు. మరోవైపు పాదయాత్రకు ముందు సెల్ఫీవిత్ లోకేష్ కార్యక్రమంలో యువనేత ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ అభిమాన నేత అప్యాయంగా పలకరిస్తూ సెల్ఫీలు దిగడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కీళ్లపూడిలో ఎస్సీ సామాజికవర్గం యువతతో ముఖాముఖి కార్యక్రమంలో లోకేష్ పాల్గొన్నారు. వారు తమ సమస్యలను లోకేష్‌కు విన్నవించుకున్నారు. లోకేష్ మాట్లాడుతూ చీర, గాజులు ఇచ్చేందుకు వెళ్లిన దళిత మహిళలను దాతరుణంగా కొట్టారని, కేసులు పెట్టి జైల్లో పెట్టారని లోకేష్ మండిపడ్డారు. రాజధాని విషయంలో జగన్ మళ్ళీ మోసం మొదలు పెట్టారన్నారు. కర్నూలు, అమరావతిలకు మోసం చేసినట్టే, విశాఖకు మోసం చేస్తారని అన్నారు. జగన్ రెడ్డి దళితుల పేరుతో రియల్ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. దళితులకు ఇంటిపట్టాలు ఇస్తున్నట్టు చెప్పి తమిళనాడు వారికి ఇస్తున్నారంటూ లోకేష్‌కు దళితులు ఫిర్యాదు చేశారు. మెరుగైన టెక్నాలజీతో తమ ప్రభుత్వమే ఇళ్లుకట్టిస్తుందని హామీ ఇచ్చారు. ఇంటికి ఒక పింఛన్ విధానం పేరుతో కుటుంబాలను విడగొడుతున్నారని, తాము కుటుంబాలు విడగొట్టకుండా పింఛన్లు అందిస్తామని తెలిపారు. జగన్ తెల్ల రేషన్ కార్డులు తీసేయాలి, ఎలా పింఛన్లు కట్ చేయాలి, పింఛన్ తగ్గించాలి అని ప్లాన్ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ కట్టింగ్‌ల ముఖ్యమంత్రి అని వ్యాఖ్యలు చేశారు. రాజారెడ్డి రాజ్యాంగం అమలుచేసి అంబేద్కర్ రాజ్యాగాన్ని అవమానిస్తున్నారని అన్నారు. మళ్ళీ అంబేద్కర్ రాజ్యాంగం అమలు అయ్యేందుకు ఏం చేయాలో చేసి బుద్ధి వచ్చేలా చేస్తామని హెచ్చరించారు. జగన్ దళిత ద్రోహి అని అన్నారు. విదేశీవిద్య పునరుద్ధరిస్తామని నియోజకవర్గంలో ఒక అంబేద్కర్ భవనం ఏర్పాటు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

అనంతరం పాదయాత్రగా సాగిస్తూ పిచ్చాటూరు శ్రీకాళహస్తి జంక్షన్‌లో ఎదురైన ఓ ఆర్టీసీ బస్సును ఎక్కి ప్రయాణికులను ఆప్యాయంగా పలకరించారు. టీడీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ ఛార్జీలు.. వైసీపీ పాలనలో ఆర్టీసీ ఛార్జీల మధ్య వ్యత్యాసాన్ని ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఛార్జీలు పెంచి విపరీతంగా భారం పెంచారని లోకేష్‌కు విన్నవించారు. వైసీపీ ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి వారు ప్రయాణించే ఆర్టీసీ ఛార్జీలను మూడుసార్లు పెంచిందని మండిపడ్డారు. జగన్‌రెడ్డి బాదుడే బాదుడుకు ప్రజలపై విపరీతమైన భారం పెరిగిందన్నారు. పెంచిన ఆర్టీసి ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో విలీనం చేస్తే ఆర్టీసీ కార్మికుల జీవితాలు మారిపోతాయి అన్నారని... విలీనం చేసి గాలికి వదిలేశారని విమర్శించారు. విడిగా ఉన్నప్పుడు ఉన్న లబ్ది కూడా లేక ఆర్టీసీ సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ సిబ్బందికి రావాల్సిన బెనిఫిట్స్ ఏమీ కూడా ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత దక్కలేదని లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తులసికృష్ణాపురంలో మత్స్యకారులతో మాట్లాడారు. జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయిన అరణియార్ ప్రాజెక్టు ఎంతోమందికి జీవనాధారం అయ్యిందని, ఈ ప్రాజెక్టు కింద వందల మంది రైతులు బతుకుతున్నారని అన్నారు. ప్రాజెక్టులో చేపల పెంపకం ఎక్కువగా ఉందని, దీని ద్వారా మత్స్యకారులు వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని అలాంటి ప్రాజెక్టుటకు జైకనిధులతో రూ.34 కోట్లు మంజూరు అయితే ఇంత వరకు 20 శాతం పనులు కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తప్పన టిడిపి ప్రభుత్వమే వస్తుందని, ప్రాజెక్టు పనులు పూర్తి చేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పొలాల్లో పనిచేస్తున్న మహిళా కూలీలను ఆత్మీయంగా పలకరిస్తూ ముచ్చటించారు. కూలీలకు రోజువారీ కూలి ఎంత గిట్టుబాటు అవుతున్నదని అడిగి తెలుసుకున్నారు. పెరిగిన ధరలతో జీవనం సాగించడం కష్టంగా ఉందని, ఉప్పు, పప్పు, కూరగాయలు కొనే పరిస్థితి లేదని కూలీలు వాపోయారు. టిడిపి వచ్చిన వెంటనే పేద, మధ్య తరగతి ప్రజలకు అన్ని రకాలు న్యాయం చేస్తామని చెప్పారు. పాదయాత్ర అనంతరం రాత్రి కెవిబిపురం మండలం రాయిపేడు గ్రామంలో బస చేస్తారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పంపాక లక్ష్మీ, ఎమ్మెల్సీ కాల్వ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే హేమలత, సత్యవేడు ఇన్‌ఛార్జి హెలెన్, నరసింహయాదవ్, జెడి. రాజశేఖర్, తిరుమల రెడ్డి, ఇలంగోవన్ రెడ్డి, పద్మనాభరాజు, సతీష్ నాయుడు పాల్గొన్నారు.

కెవిబిపురం: మండలంలోకి ప్రవేశించిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, బీద రవిచంద్ర యాదవ్, సత్యవేడు టిడిపి ఇన్చార్జ్ హెలెన్ హేమలత, అధ్యక్షుడు రామంజుల నాయుడు, క్లస్టర్ ఇంచార్జి మునస్వామి యాదవ్ ఆధ్వర్యంలో మిద్ది కండిగ వద్ద నాలుగు గంటలకు నారా లోకేష్ బాబును గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.

మత్స్యకారులతో మాట్లాడుతున్న లోకేష్

గుమ్మడి కుతూహలమ్మ కన్నుమూత

పలువురు ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి- తిరుపతి సిటి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీమంత్రి, డిప్యూటీస్పీకర్ గుమ్మడి కూతుహలమ్మ బుధవారం ఉదయం వారి స్వగృహంలో మరణించారు. గుమ్మడి కూతుహలమ్మ వతరీత్యా వైద్యురాలు. డాక్టర్ గుమ్మడి కుతూహలమ్మకు డాక్టర్ మునిసిద్దయ్యతో వివాహం జరిగింది. వీరికి ఆనగంటి సురేష్, ఆనగంటి డాక్టర్ హరికష్ణ ఇద్దరు కొడుకులు. చిత్తూరు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేయడం ద్వారా రాజకీయాల్లోకి అడుగులు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా 1985, 1989, 1999, 2004 ఎన్నికలలో వేపంజేరి నియోజకవర్గం నుంచి, 2009లో గంగాధర నెల్లూరు నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచారు. 1994లో కాంగ్రెస్ నుంచి టికెట్ రాకపోవడంతో వేపంజేరి నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. 2014లో గంగాధర నెల్లూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసినప్పుడు ఓడిపోయారు. 1992-1993 మధ్యకాలంలో నేదురుమల్లి జనార్ధనరెడ్డి మంత్రివర్గంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇంటిలోనే చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తిరుపతిలోని స్వగహంలో నిద్ర లోనే కన్నుమూసారని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

కుతూహలమ్మ (ఫైల్ ఫొటో)

నేడు వి.లక్ష్మిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు

గంగాధరనెల్లూరు: మాజీమంత్రి గుమ్మడి కుతూహలమ్మ బుధవారం ఉదయం తిరుపతిలో మరణించారు. కాగా కుతూహలమ్మ భౌతిక కాయాన్ని గంగాధరనెల్లూరు మండలం వింజం పంచాయతీ వి.లక్ష్మిరెడ్డిపల్లి దళితవాడలో గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించినట్లు ఆమెకు భర్త డాక్టర్ మునిసిద్దయ్య, కుమారులు సురేష్, హరిక్రిష్ణ తెలిపారు.

కుతూహలమ్మ మరణం తీరని లోటు

కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్

మెడికల్ స్టూడెంట్‌గా, డాక్టర్‌గా, చిత్తూరు జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా కుతూహలమ్మ ఎదిగారన్నారు. రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదిగి, విశేష సేవలు అందించారు. ఆమె మరణించడం ఈ ప్రాంతానికి తీరనిలోటన్నారు. ఒక సామాన్య దళిత కుటుంబంలో పుట్టిన మహిళ, రాజకీయంగా ఉన్నత పదవులు పొందడం గొప్ప విషయమన్నారు. కుతూహలమ్మ రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీతో ప్రారంభమైందని అన్నారు. దళితులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గొప్ప అవకాశాలు, గుర్తింపు, గౌరవం మరే ఇతర రాజకీయ పార్టీల్లోనూ సాధ్యం కాదని అన్నారు.

కుతూహలమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించిన చింతా మోహన్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. కమిషనర్ బుధవారం మధ్యాహ్నం నగరంలో కట్టమంచి నగరపాలక ఉన్నత పాఠశాలను తనిఖీచేశారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని, బుధవారం నాటి మెనూ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచిగా రోజూ ఇలానే రుచిగా, మెనూప్రకారం భోజనం పెడుతున్నారా, కోడిగుడ్డు పెడుతున్నారా అని విద్యార్థులతో ఆరా తీశారు. అనంతరం కమిషనర్ విద్యార్థుల ఆన్లైన్, హాజరు రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కన్సిస్టెన్స్ రిథమ్ యాప్‌ను పరిశీలించారు. వార్డు కార్యదర్శిలు యాప్‌లో అప్లోడింగ్ చేపట్టిన తీరును తనిఖీ చేశారు. రానున్న పదోతరగతి పరీక్షల కోసం విద్యార్థులను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో సెల్వరాజ్, సీఎం గోపి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టర్లు, కరపత్రాలకు బిల్లులు తప్పనిసరి

డిఆర్ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులకు వేయించిన పోస్టర్లు పాంప్లెట్స్ సంబంధించిన బిల్స్‌ను తప్పనిసరిగా ప్రింటింగ్ యజమానులు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ డిఆర్ఓ సమావేశం హాల్‌లో జిల్లా ఆడిట్ అధికారి రంగయ్యతో కలిసి కో-ఆపరేటివ్, ప్రైవేటు ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి నియోజకవర్గాలకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థలకు సంబంధించి ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలక్షన్ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చు లిమిట్ లేదని, అభ్యర్థులు రోజువారీ ప్రింటింగ్‌కు అయ్యిన ఖర్చులకు సంబంధించిన బిల్స్‌ని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. ప్రింటింగ్ సంబంధించి చిరునామా, ప్రింటింగ్ చేసిన పోస్టర్స్, పాంప్లెట్స్ పైన తప్పనిసరిగా ప్రింటింగ్ ప్రెస్ చిరునామా ఉండాలన్నారు. ఎన్ని కాపీలు ప్రింటింగ్ చేస్తే అన్ని కాపీలకు బిల్లులు ఇవ్వాలని, బిల్లులు ఇవ్వని ప్రింటింగ్ ప్రెస్‌లు ఎన్నికల నియమావలని అతిక్రమించిన వారు అవుతారని, బిల్లులు సక్రమంగా సకాలంలో అందజేయని ప్రింటింగ్ ప్రెస్‌లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు అందజేసిన బిల్స్ అన్ని జిల్లా ఆడిట్ అధికారిచే ఆడిట్ చేయించిన తర్వాత ఎలక్షన్ కమిషనర్‌కు పంపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సి.సెక్షన్ సూపరింటెండెంట్ వాసు, డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు దశల వారీగా పరిష్కారం

నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య కార్మికుల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. బుధవారం నరగపాలక కార్యాలయం వద్ద మున్సిపల్ కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల రిలే దీక్షా శిబిరం వద్దకు కమిషనర్ వెళ్లి మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ అరుణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు అందించాల్సిన యూనిఫామ్, సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు కోసం ఇప్పటికే పలుసార్లు టెండర్లు పిలిచామన్నారు. ప్రత్యామ్నాయంగా జగనన్న మార్ట్ నుండి అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆప్రాన్స్, యూనిఫాంను త్వరలో అందిస్తామని, పారిశుధ్య పనుల కోసం పుష్ కాట్లు, వీల్స్, డబ్బాలు తదితర సామాగ్రిని వీలైనంత త్వరగా అందిస్తామన్నారు. పారిశుధ్య కార్మికుల కోసం ఈఎస్ఐ కార్డులు సిద్ధంగా చేశామన్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన కొన్నింటిని అక్కడికక్కడే కార్మికులకు అందించారు. మిగిలిన సమస్యలను క్రమం తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీక్ష శిబిరం వద్దకు నగర కమిషనర్ స్వయంగా వచ్చి సమస్యలు తెలుసుకుని, పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంపై పారిశుధ్య కార్మికులు, యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకానాథం, నరసింహ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకుందాం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక యూటీఎఫ్ కార్యాలయం ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రాతినిధ్యం చేసే సందర్భంలో వారికి అనుమతులు ఇవ్వకపోగా, అణచివేత కగురి చేస్తూ ఉండడాన్ని యుటిఎఫ్ గా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి మూడో తేదీన సిపిఎస్ రద్దు గురించి ఉద్యోగ ఉపాధ్యాయుల మనోభావాలను తెలియజేయుట నిమిత్తం కోసం గన్నవరంలో యుటిఎఫ్ పెట్టిన దీక్షను భగ్నం చేయడమే కాకుండా చాలా మంది ఉపాధ్యాయులు మీద అక్రమ కేసులు, బైండోవర్ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నాం అని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన సిపిఎస్ రద్దు హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా పేరుకుపోయిన బకాయిలను చెల్లించాలని కోరారు. అనంతరం తూర్పు రాయలసీమలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.బాబురెడ్డి అలాగే పట్టభద్రులు ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర్ రెడ్డిని ప్రథమ ప్రాధాన్యత ఓటు ద్వారా గెలిపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులు కైవసం చేసుకున్న మల్లికార్జున



గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పిన సదుం మండల వాసి మల్లికార్జున

ప్రజాశక్తి - సోమల: సదుం మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన మేజారి చిన్నమల్లయ్య, రాజమ్మల కుమారుడు డాక్టర్ మేజారి మల్లికార్జున గిన్నీస్ రికార్డు నెలకొల్పాడు. ఒక నిమిషంలో ఎక్కువ దేశాల కాలింగ్ కోడ్‌లను గుర్తించిన వ్యక్తిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. గతంలో చెన్నైకి చెందిన వ్యక్తి ఒక నిమిషంలో 51 దేశాల కాలింగ్ కోడ్‌లను గుర్తించగా డాక్టర్ మేజారి మల్లికార్జున ఒక నిమిషంలో 56 దేశాల కాలింగ్ కోడ్‌లు గుర్తించి ఈ రికార్డు సాధించాడు. గతంలో కూడా యోగాలో ఒక రికార్డు నెలకొల్పిన మల్లికార్జున, ఈ రికార్డు సాధించడంతో రెండు గిన్నీస్ రికార్డులు సాధించిన వ్యక్తిగా అరుదైన గుర్తింపు పొందాడు. తల్లిదండ్రులు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. పాఠశాల విద్యాభ్యాసం నడిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాలలో, తర్వాత జవహర్ నవోదయ విద్యాలయలో జరిగింది. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విశ్వవిద్యాలయంలో బిఏ, ఎంఏ ఏకనమిక్స్ చేసి 2020లో ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ కూడా పొందారు. ఒక సంవత్సరం పాటు విశాఖపట్నం జిల్లా భీమిలిలో యోగాలో పీజీ డిప్లొమా కూడా చేసారు. మల్లికార్జున ఈ రికార్డు కోసం దాదాపు నాలుగు నెలల పాటూ సాధన చేశారు. 2022 డిసెంబర్‌లో రెండు సార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు. జనవరి 26న పుంగనూరులో ఇద్దరు నిపుణుల సమక్షంలో ఈరికార్డు కోసం ప్రయత్నించి విజయవంతంగా రికార్డు నెలకొల్పాడు. ఆ వీడియోను రికార్డు చేసి లండన్‌లోని గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారికి పంపగా వారు దానిని సమీక్షించి కొత్తరికార్డుగా గుర్తిస్తూ డాక్టర్ మేజారి మల్లికార్జునకు ప్రశంసాపత్రాన్ని పంపారు. ప్రస్తుతం మల్లికార్జున తిరుపతిలో "ధీర ఎడుకేర్" పేరుతో ఒక స్టార్టప్ కంపెనీ స్థాపించి, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరియర్ గైడెన్స్, యోగా మొదలైన వాటిలో శిక్షణ ఇస్తున్నారు. సదుం మండల వాసికి రెండు ప్రపంచ రికార్డులు రావడం పై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మల్లికార్జునకు పలువురు ప్రశంసలను అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు

సమన్వయంతో పనిచేయండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందనలో అందిన అర్జీల పరిష్కారంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా స్పందన, మీసేవా, ఏపీ సేవా, రీ సర్వే, హౌసింగ్, నాడు- నేడు తదితర అంశాలపై అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు, తహశీల్దార్‌లు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందన, ఏపీ సేవాలలో ప్రజల నుంచి అందిన సమస్యల పరిష్కారంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఆదాయ, కులధ్రువీకరణ పత్రాల కొరకు విచారణ పూర్తిచేసి మంజూరు చేయాలన్నారు. ముఖఆధారిత హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సజావుగా ఎన్నికల నిర్వహణకు సంబంధింత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. సమావేశంలో జెడ్పి సీఈవో ప్రభాకర్ రెడ్డి, పిఆర్ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డిఆర్‌డిఎ, డ్వామా, హౌసింగ్ పిడిలు తులసి, గంగా భవానీ, పద్మనాభం, డిపిఓ లక్ష్మీ, అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ మండలం ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు అర్బన్ మండలం ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతానికి చిత్తూరు మండల పరిధిలోని 33 గ్రామ పంచాయతీలను చిత్తూరు రూరల్ మండల పరిధిలో 26గ్రామాలు, చిత్తూరు అర్బన్ పరిధిలో ఏడు గ్రామాలు, చిత్తూరు నగరంతో పాటు ఏర్పాటు చేస్తున్నారు. చిత్తూరు రూరల్ మొత్తం జనాభా సంఖ్య 4,1,186 భూవిస్తీర్ణం 3,1,503 ఎకరాలు, ఇందులోని గ్రామాలు తేనబండ, దిగువమాసపల్లి, అయినవేడు, ముత్తుకూరు, ఆనగల్లు, పాలూరు, బిఎన్ఆర్ పేట, అర్తల, 194 బండపల్లి, కష్ణాపురం, గొల్లపల్లి, గువ్వకల్లు, పెద్ది శెట్టిపల్లి, తుమ్మెద, సిద్ధంపల్లి, పెరుమాలకండ్రిగ, చింతలగుంట, తలంబేడు, అనంతపురం, పచ్చునపల్లి, సెట్టియాప్పంతంగాల్, 5-వెంకటాపురం, కుర్చివేడు, అలుకూరుపల్లి, 33-వెంకటాపురం గ్రామాలు, చిత్తూరు అర్బన్ మండలం పరిధి లో 7 గ్రామాలు, చిత్తూరు టౌన్, మొత్తం జనాభా సంఖ్య 2,30,154 భూవిస్తీర్ణం 2,3,446 ఎకరాలు, ఇందులోని గ్రామాలు అనుపల్లె, మాపక్షి, నరిగపల్లి, లక్ష్మంబాపురం, ముర్గంబట్టు, మంగసముద్రం, దొడ్డిపల్లి, టౌన్ పరిధిలోని తిమ్మసముద్రం, కట్టమంచి, గాండ్లపల్లి, చిత్తూరు, గిరింపేట, ఇరువారంలు ఉన్నాయి.

నగరిలో ఇంకా తగ్గని రాజకీయ వేడి..

జైలు నుంచి బెయిల్ పై వచ్చిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- నగరి: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర నగరి నియోజకవర్గంలోకి ప్రవేశించిన సందర్భంగా పుత్తూరులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి రోజాపై తనదైన శైలిలో విరుచుకపడ్డారు. మంత్రి రోజా తన కుటుంబ సభ్యులకు నగరి నియోజకవర్గాన్ని దోచుకోవడానికి పంచిపెట్టి రాత్రిపూట కూర్చుని వాటా పంచుకుంటారని, వడమాలపేట టోల్‌గేట్ వద్ద దాదాపు 55ఎకరాల ప్రభుత్వ భూమిని, విజయపురం మండలం కోసల నగరం, పాతార్కాడు ప్రాంతాల్లో భూములను ఆక్రమించి జబర్దస్తాలా అమ్ముకున్నదని, నియోజవర్గంలోని ఇసుక, గ్రావెల్‌తో సహా రేషన్ బియ్యం, ఎర్రచందనం అక్రమంగా రవాణా చేసి సంపాదించుకుంటున్నదని, ఊరికో విల్లా కట్టుకున్నదని, రోజా కుటుంబ సభ్యులు తప్ప నగరి నియోజకవర్గ ప్రజల జీవితాలు బాగుపడలేదని ఆరోపణలు చేశారు. లోకేష్ విమర్శలకి విజయవాడలో ఉన్న మంత్రి రోజా కౌంటర్ ఇస్తూ తన సోదరులు, భర్త తనకు అండదండలు అందించడం తప్పా రాజకీయంగా జోక్యం చేసుకోలేదని, తాను సినిమా రంగంలో సంపాదించిన సొమ్ముతోనే విల్లాలు కట్టుకున్ననాని, అవసరమైతే తన ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమని, లోకేష్ సిద్ధమా అని సవాల్ విసరడంతో పాటు తన కుటుంబ సభ్యులపై అనవసర, అసత్య ఆరోపణలు చేస్తే మూతి పగిలిపోతాదని హెచ్చరించారు. ఈనేపథ్యంలో నిన్నటి రోజున టీడీపీకి చెందిన రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి మీరా, అరుణతో పదిమంది మహిళలు పోలీసుల కళు గప్పి నగరిలోని మంత్రి రోజా నివాసానికి చీర, గాజులు తీసుకెళ్లారు. అయితే అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కి తరలించారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోలీసుస్టేషన్ ప్రాంగణానికి చేరుకుని పోలీసుల సమక్షంలోనే పరస్పరం నినాదాలు, ప్రతి నినాదాలు చేసుకున్నారు. పోలీసులు ఇరువర్గాలను బయటికి పంపించేశారు. అయితే ఇరువర్గాలు కూడా పోలీసు స్టేషన్ బయట రోడ్డు మీదా బైఠాయించి భీష్మించికూర్చున్నారు. రాత్రి 8:30 గంటల వరకు సమస్య సద్దుమనగకపోవడంతో పక్క మండలాల ఎస్‌ఐలు, పోలీసులు, స్పెషల్ పార్టీ బలగాలు స్వల్ప లాఠీఛార్జీతో ఇరువర్గాలను చెదరగొట్టారు. మహిళా నాయకులతో పాటు 11 మందిని అదుపులోకి తీసుకున్న నగరి పోలీసులు మొత్తం 30మంది మీద వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం ఉదయం 3 గంటల ప్రాంతంలో నగరి జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ విష్ణువర్మ ముందు హాజరు పర్చారు. జడ్జీ ఆదేశాల మేరకు 15రోజుల రిమాండ్ నిమిత్తం చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు. టీడీపీ వారికి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కి పంపించే వరకు గాలి భాను ప్రకాష్ కోర్టు ఆవరణలోనే ఉంటు పార్టీ న్యాయవాదులతో బెయిలుపై సమీక్ష నిర్వహించారు. ఉదయం పది గంటలకు కోర్టు తెరవగానే తమ పార్టీ నాయకులకు బెయిలుపై కోర్టుకు విజ్ఞప్తి చేయగా కొన్ని షరతులతో బెయిలు మంజూరు చేసింది. ఇంతలోనే వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు మంత్రి రోజా ఇంటి వద్దకు పెద్దఎత్తున చేరుకుని అక్కడి నుండి వరకు ర్యాలీ చేపడుతూ టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నగరి పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద లోకేష్, భాను ప్రకాష్‌ల చిత్రపటాలను చీపురులు, చెప్పులతో కొట్టి తన నిరసనను తెలియజేశారు. అంతేగాక ఇకమీదట తమ నాయకురాలు రోజా మీద పల్లెత్తు మాట మాట్లాడినా గాలి భానుప్రకాష్‌ని నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరించారు. సాయంత్రం 5 గంటలకు అరెస్ట్ అయ్యిన టీడీపీ నాయకులు చిత్తూరు సబ్‌జైల్ నుండి విడుదలయ్యారు. మొత్తానికి నగరిలో రాజకీయ వేడి ఇంకా తగ్గలేదనే చెప్పాలి.

వైసిపి నాయకుల నిరసన

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మహాశివరాత్రికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని మొగిలిగ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ కామాక్షి సమేత మొగిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ఆలయ కార్యనిర్వహణ అధికారి మునిరాజులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు మాట్లాడుతూ మొగిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, దర్శనం, వైద్యం తదితర విషయాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, తహశీల్దార్ బెన్‌రాజ్, ఎస్సై మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, గ్రామస్తులు శేఖర్ రెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం సాయంత్రం మూషిక వాహనంపై వినాయక స్వామి ఉత్సవ విగ్రహం గ్రామంలోని పురవీధుల్లో ఊరేగారు. మొదట స్వయంభుగా వెలిసిందు మొగలిరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం మూషిక వాహనంపై వినాయక ఉత్సవ కార్యక్రమం జరిగింది. ఉభయ దారులుగా బంగారుపాళ్యానికి చెందిన సరస్వతీ సుధాకర్ నాయుడు వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేసుకుంటే మాతాశిశుమరణాలు తగ్గుతాయని వైద్యాధికారి మోహన్ కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉప కేంద్రంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి సమక్షంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షకు వచ్చిన గర్భిణులతో డాక్టర్ మోహన్ కృష్ణ మాట్లాడుతూ గర్భిణులు తప్పకుండా నెలసరి వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలో చేసుకుంటే ఉచితంగా జనన సర్టిఫికెట్, మాతాశిశువులను స్వేచ్ఛగా ప్రభుత్వ వాహనంలోనే స్వగ్రామానికి చేరుస్తారన్నారు. ఆశా కార్యకర్తలు గర్భిణుల ప్రసవం వరకు వారికి అందుబాటులోనే ఉండాలని తెలిపారు. గర్భిణులకు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బుధవారం పుంగనూరు టు బైరెడ్డిపల్లి జాతీయ రహదారిలోని ఆకులకొత్తూరు మలుపు వద్ద ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీని కారణంగా పెద్దపంజాణి మండలం, బట్టందొడ్డి పంచాయతీ, కురపల్లి గ్రామానికి చెందిన శివ కుమార్ (32) సొంత పనిమీద బైరెడ్డిపల్లికి వచ్చాడు. అనంతరం స్వంత గ్రామానికి ద్విచక్ర వాహనం మీద బయలుదేరాడు. పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పుంగనూరు నుండి వెంగాంవారిపల్లి వెళ్ళుటకు ఆకులకొత్తూరు మలుపు వద్దకు రాగానే ఎదురుగా ద్విచక్రవాహన దారుడు అతిగా మద్యం సేవించి వేగంగా రావడంతో బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును రోడ్డునుండి పూర్తిగా ఎడమ వైపునకు తిప్పేశాడు. ద్విచక్ర వాహనదారుడు బస్సుకి వెనుక బాగాన్ని ఢీకొని బోల్తా పడ్డాడు. అతడికి తలపైన బలమైన గాయం కావడంతో 108 సిబ్బంది బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. పోలీసులు అక్కడికి చేరుకొని, కేసు నమోదుచేసి మెరుగైన చికిత్సకోసం కుప్పం పిఇఎస్ ఆసుపత్రికి తరలించినట్లు డాక్టర్ విజయచంద్రన్ తెలిపారు.

ఈఎస్ఐ ఆసుపత్రిలో సబ్ కమిటీ తనిఖీలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి నగరం ఆర్సీరోడ్డులోని కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) ఆసుపత్రిని బుధవారం ఈఎస్ఐ కార్పొరేషన్ మెడికల్‌కేర్ సబ్‌కమిటీ అధికారులు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఈఎస్ఐ లబ్ధిదారులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, అవుట్ పేషెంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ తదితర విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను, సౌకర్యాలపై రోగుల నుండి ఆరా తీశారు. ఈసందర్భంగా ఈఎస్ఐ లబ్ధిదారులు, రోగులు ఆసుపత్రిలో తాగునీరు, టాయిలెట్స్ లాంటి సౌకర్యాలు సరిగా లేవని, ఆసుపత్రిలో కొన్ని రకాల మందులను మాత్రమే ఇస్తున్నారని, మరికొన్ని బయటి నుంచి కొని తెచ్చుకోవలసి వస్తోందని ఫిర్యాదు చేశారు. కేంద్ర ఈఎస్ఐసి రేట్ కాంట్రాక్టులో రోగులకు ఎక్కువగా ఉపయోగపడే మందులు లేని కారణంగా తాము మందులను రోగులకు పూర్తిస్థాయిలో ఇవ్వలేక పోతున్నామని ఆసుపత్రి డాక్టర్స్ సబ్ కమిటీ సభ్యులు కేవీ.శేఖర్ రాజు, మెడికల్ కమీషనర్ (సౌత్‌జోన్) డాక్టర్ సునీత చోప్రా దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సర్జికల్, ల్యాబ్ ఐటమ్స్ రేట్ కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లు పూర్తి అయినా ఇంతవరకు కొత్త వాటిని పునరుద్ధరణ చేయలేదని, ఫలితంగా సరిజికల్ ఐటమ్స్ లేక ఇబ్బంది ఏర్పడుతుందని డాక్టర్స్ కమిటీకి చెప్పారు. ల్యాబ్‌లో గత కొన్ని నెలలుగా పూర్తి స్థాయిలో రక్తపరీక్షలు చేయకపోవడంపై కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికసంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వారు ఈసందర్భంగా ప్రస్తావించగా ప్రభుత్వం, ఈఎస్ఐ కార్పొరేషన్ దృష్టికి తీసుకొని వెళ్తామని చెప్పారు. పాత భవనంలో నడుస్తున్న ఈఎస్ఐ డిస్పెన్సరీ, రేణిగుంట డిస్పెన్సరీలను సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలను, మందుల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌కమిటీతో పాటు తిరుపతి రీజియన్ ఈఎస్ఐ కార్పొరేషన్ అధికారులు డి.రాధాకష్ణ, కె.రజినీకాంత్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శ్రీధర్, ప్రాంతీయ ఈఎస్ఐసి మెంబెర్ ఎన్.మోహన్ రాష్ట్ర బీమా వైద్య శాఖ కడప జోన్ జాయింట్ డైరెక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.

ప్రేమతోనే చీరా, జాకెట్, గాజులు పంపాం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నారా లోకేష్‌కు చీరా, గాజులు పంపుతానని మంత్రి రోజా అంటే మహిళలపై ఉన్న అభిమానంతో రోజాకు చీరా, జాకెట్ గాజులు పంపారని తెలుగుదేశం మాజీ ఎంఎల్‌ఎ హేమలత, చిత్తూరు నగర మాజీ మేయర్ కఠారి హేమలత తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రశాంతంగా జరుగుతున్న పాదయాత్రపై బురదజల్లే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. మంత్రి రోజాకు చీరా జాకెట్ ఇచ్చేందుకు వెళ్లిన తెలుగు మహిళలపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించడంతో పాటు కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించడం పట్ల అమానుషమన్నారు.

అసైన్మెంట్ భూముల గుర్తింపు ప్రక్రియ వేగవంతం

నిబంధనల ప్రకారం 22 ఎను పూర్తిచేయండి: కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దళితవాడలలో శ్మశానవాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సకాలంలో గుర్తించి పంచాయతీలకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ తెలిపారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూకు సంబంధించిన పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, డిఆర్‌ఒ ఎన్.రాజశేఖర్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 187 దళితవాడలకు సంబంధించి ఇంకా స్మశాన స్థలాలను అప్పగించాల్సి ఉందని, ఈ అంశంనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మండలాలకు సంబంధించిన తహశీల్దార్లు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అసైన్మెంట్ భూముల కోసం గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. 22ఎ కింద పలు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అసైన్మెంట్ చట్టం ప్రకారం జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని, ఎక్కువ పెండింగ్‌లో ఉన్న మండలాల తహశీల్దారులు తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో పలు ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. రీసర్వే మొదటిదశలో 134 గ్రామాలకు సంబంధించి భూహక్కుపత్రాలు పంపిణీ కార్యక్రమం జరుగుతోందని ఈ కార్యక్రమానికి ముందే పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించాలన్నారు. డ్రోన్‌సర్వే జరిగిన గ్రామాలకు సంబంధించి మరో 23గ్రామాలకు ఓఆర్‌ఐ మ్యాపులు రావడం జరిగిందని, గ్రౌండ్ ట్రూథింగ్ వేగవంతంగా నిర్వహించాలని అన్నారు. గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తి అయిన తర్వాత 9(2) నోటీసులను సకాలంలో అందించాలని నిర్ణయించిన తేదీ నాటికి పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వ్యాప్తంగా 6000 సర్వే రాళ్లు సిద్ధంగా ఉన్నాయని అవసరమైన గ్రామాలలో ఈకార్యక్రమాన్ని పూర్తి చేయాలనన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు పలమనేరు, నగరి ఆర్డీఓలు రేణుక, శివయ్య, సజన, డిఐలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లోనే పోలింగ్ బూత్‌లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ కార్యాలయాలలోనే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న 21 జిల్లాల డిఆర్‌ఓలతో, ఎన్నికల నిర్వహణపై చిత్తూరు జిల్లా కలెక్టరేట్ నుంచి డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, జిల్లాల్లో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్న జిల్లా మాస్టర్ శిక్షకులు చంద్రశేఖర్ నాయుడు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి కార్యాలయం అధికారులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ కార్యాలయాలలోనే ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన విధులను వివరించారు. రిటర్నింగ్ అధికారి, పిఓల హాండ్ బుక్‌లను అందించనున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ చెక్‌లిస్టు ఆధారంగా పోలింగ్ ముందు రోజే చేరుకొని ఏర్పాట్ల సరిచుసుకోవాలని, పోలింగ్ కేంద్రాలలో రాజకీయ పార్టీ నాయకుల ఫొటోలు లేకుండా చూడాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు బెల్ట్‌బాక్స్‌ను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పోలింగ్‌రోజు పోలీసు సిబ్బంది, ప్రిసైడింగ్ అధికారి డైరీ నిర్వహణ, ప్రశాంతగా పోలింగ్ నిర్వహించాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డుతో ఓటుహక్కు వినియోగించుకొనే విధంగా చూడాలని, సూక్ష్మ పరిశీలకుల నివేదిక, వెబ్‌కాస్టింగ్ వీడియో నిర్వహణ చేయాలన్నారు. స్థానికంగా పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల హాండ్‌బుక్స్ ఆధారంగా అర్థమయ్యే రీతిలో మూడు సార్లు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రిజర్వేషన్ ఉండవని, బ్యాలెట్ పేపర్‌లో పార్టీల గుర్తులు ఉండవని తెలిపారు. సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్యేలు, ఎంపీల అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు లిమిట్‌గా ఉంటుందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఖర్చు లిమిట్ ఉండమని తెలిపారు. ఉపాధ్యాయ, పట్టభద్రులకు నిర్వహించే పోలింగ్‌కేంద్రాలు వేరువేరుగా ఉండాలని తెలిపారు. పట్టణ ప్రాంతాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు, రూరల్ ప్రాంతాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండే విధంగా ముందుగానే పరిశీలించేకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలు ఒకవేల మార్పులు చేయవలసి వస్తే మార్పు చేసిన వెంటనే పోలింగ్ కేంద్రాలు వివరాలను రాజకీయ పార్టీ నాయకులకు ఎలక్షన్ కమిషనర్‌కు ముందుగా తెలియజేయాలన్నారు. ఈనెల 16న నోటిఫికేషన్‌ను జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, 16 నుంచి 23వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, 24వ తేదీన నామినేషన్ల పరిశీలన, 27వ తేదీన నామినేషన్లు ఉపసంహరణ ఉంటాయని, మార్చి 13న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, మార్చి 16వ తేదీన ఓట్లు లెక్కింపు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. సాధారణ ఎన్నికల్లో మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా నామినేషన్ వేయడానికి ఐదు మంది మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఒక్కసారే నామినేషన్ కు డిపాజిట్ కట్టిన అభ్యర్థి తర్వాత నామినేషన్ వేసినా కూడా మళ్ళీ డిపాజిట్ కట్టవలసిన అవసరం లేదన్నారు. 27న విత్ డ్రా అయిన అనంతరం ఫైనల్ అభ్యర్థుల జాబితాను నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. అభ్యర్థులు ఫారం-8 ద్వారా ఏజెంట్ నియమించుకునేందుకు అవకాశం ఉందని, ఏజెంట్ను మార్చుకునేందుకు ఫారం- 9 ద్వారా నియమించుకోవచ్చునని తెలిపారు.

పోరంబోకు చెరువు ఆక్రమణ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బైరెడ్డిపల్లి టు నెల్లిపట్ల జాతీయ రహదారి సమీపంలోని మర్రిమానుచేను గ్రామ పరిధిలోని తిరునగర్ కాలనీ సమీపానగల కోమటి వాని చెరువులో గతంలో రాజకీయ నాయకులు అండదండలతో, రెవిన్యూ సిబ్బంది చేతివాటంతో పట్టాలు మంజూరు చేశారు. పట్టాదారులు మా భూమిని చూపించండి అని నిలదీయగా కోమటి వాని చెరువులో నీటి మునగాడ స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది చూపించి చేతులు దులిపేసుకున్నారు. దీంతో కోమటి వాని చెరువు కింద పంటలు పండిస్తున్న రైతులు ఆందోళన చెంది తహసీల్దారుకు మూడో తేదీ అర్జీ సమర్పించినా ప్రయోజనం లేదన్నారు. కోమటి వాని చెరువు కింద వ్యవసాయం చేస్తున్న రైతులు చెరువును నష్టపోతామని, త్వరలో ఉన్నత అధికారులు దీనిపై స్పందించి చెరువులో ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని మర్రిమానుచేను, మూల తుమ్మేపల్లి, ధర్మపురి తూర్పు గడ్డ, చంద్రమాకుల గడ్డ గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఉన్నత లక్ష్యంతో ఉపాధి అవకాశాలను పెంపొదించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ఓపన్ డే ఓరియన్టేషన్ కార్యక్రమం ద్వారా ఇంటర్ విద్యార్థులు డిగ్రీ కళాశాలలో చేరడానికి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాలమేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, ఉన్నత బోధన విధానాన్ని గురించి ఇంటర్ విద్యార్థులకు వివరించారు. అలాగే పాఠ్య కార్యకలాపాల డిజిటల్ క్లాస్‌రూం, విద్యార్థులు సెమినార్స్, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, జేకేసీ ద్వారా ఉపాధివకాశాలు, ఇంటర్నెట్ కలిగిన కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం, ఇంటర్న్‌షిప్, వెనుకబడిన విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన అందించి డిగ్రీ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరిన వారికి ఉద్యోగ సాధనకు కావాల్సిన నైపుణ్యాలను బోధించడం, కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందుంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పూర్తిస్థాయిలో పాటించాలి: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జిల్లాలో పరిశ్రమల్లో పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని, రసాయన ప్రమాదాలు నివారణకు, ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై సత్వరమే స్పందించాలని నివారించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి సంబంధింత అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ మొదటి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన క్రైసిస్ గ్రూప్ సభ్యులైన పరిశ్రమల ప్రతినిధులతో, అగ్ని మాపక, ఫాక్టరీస్, కాలుష్య నియంత్రణ, రెవెన్యూ, పోలీస్, వైద్య, తదితర అధికారులతో సమావేశమై పలు సూచనలు చేసి, దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మేజర్ యాక్సిడెంట్ హజార్డ్ తపరిశ్రమలు ప్రమాదకర జాబితాలో ఉన్న ఫ్యాక్టరీలు, కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రమాదకర కెమికల్స్ రూల్స్ - 1996 మేరకు తిరుపతి జిల్లాలో 11 ఎంఏహెచ్ జాబితాలో ఉన్నాయని తెలుపుతూ ఈ యూనిట్ల లో ఏదైనా రసాయన ప్రమాదం సంభవించినప్పుడు ఆన్‌సైట్‌లో పరిశ్రమల యాజమాన్యం ముందస్తుగా ప్రమాదా ల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఆఫ్‌సైట్ చర్యల్లో భాగంగా ప్రధాన అత్యవసర పరిస్థితుల్లో జిల్లాలోని సంక్షోభ సమూహం (క్రైసిస్ సభ్యులు) సకాలంలో ప్రతిస్పం దించి అగ్ని, పేలుడు, విషపూరిత వాయువులు విడుదల వాటి కలయికతో ఏర్పడే ఇతర ప్రమాదాలు సంభవించినప్పుడు నిరంతర అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖలైన ఫ్యాక్టరీలశాఖ, అగ్నిమాపకశాఖ, వైద్య తదితరశాఖలు సకాలంలో స్పందించి ప్రాణ, ఆస్తినష్టం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కొరకు జిల్లా క్రైసిస్ గ్రూప్ ఒక ప్రణాళికను ఎక్స్పర్ట్ కన్సల్టెన్సీ వారితో సంప్రదించి అతిత్వరలో రూపొందించాలన్నారు. పై తెలిపిన పరిశ్రమలలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిబంధనల మేరకు సేఫ్టీ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కలిగి వాటికి సంబంధిం చిన పరికరాల పనితీరు ఎప్పటికప్పుడు తనిఖీ చేపట్టాలని అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అలాగే జిల్లాలో ఆఫ్‌సైట్ రెస్క్యూ చర్యల అత్యవసర ప్రణాళికలు త్వరిత గతిన సిద్ధం కావాలని డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వారిని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదం సంభవిం చిన సందర్భంగా చేపట్టే చర్యలను నమూనా మాక్‌డ్రిల్ ద్వారా పరిశ్రమల ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. స్థానిక క్రైసిస్ గ్రూపులు శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్లూరుపేట డివిజన్లో ఏర్పాటు కావాలని తెలిపారు. ఫైర్ డిపార్ట్మెంట్ వారిచే పరిశ్రమల్లోని సిబ్బందికి అగ్నిప్రమాద నివారణ, ప్రమాదసమయాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై, ఆన్‌సైట్ శిక్షణ ఇవ్వాలని తదనుగుణంగా పరిశ్రమల యజమానులు చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ, స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆదేశాల మేరకు ఈనెల 23న ఎంఏహెచ్-ఏ కేటగిరి పరిశ్రమలలో అత్యవసర మాక్‌డ్రిల్ చేపట్టనున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీవెంకట్రావు, జిల్లా ఫైర్‌ఆఫీసర్ రమణయ్య, గూడూరు ఆర్డీఓ తకిరణ్ కుమార్, జిల్లా రవాణా అధికారి సీతారాంరెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని ఎం కొత్తూరు పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 30 టీములు పాల్గొనగా, అందులో గెలుపొందిన వారికి స్థానిక సర్పంచ్ చంద్రమౌళి అలియాస్ రాజారెడ్డి మరియు రామసముద్రం యూత్ కలిసి మొదటి విజేత కమ్మసంద్రానికి రూ.22,222 లు, రెండవ విజేత నడిపేపల్లికి రూ.11,111 లు, మూడవ విజేత పాతూరునాత్తానికి రూ.5,555 లు, నాల్గవ విజేత కమ్మనపల్లికి రూ.3,333 లు బహుమతులు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ యువత స్పోర్ట్స్‌లో రాణిస్తూ గ్రామ స్థాయిలోనే కాకుండా ఉన్నత స్థాయిలో గెలుపొందాలన్నారు. మీ తల్లిదండ్రులకు, మీకు విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తెస్తూ ఇతర రాష్ట్రాల్లో కూడా మన మండలంలోని యువత గెలుపొంది చూపించాలని ఆటగాళ్లకు ఆయన తెలియజేశారు.

మోటర్ సైకిల్ వేలం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం పోలీస్‌స్టేషన్‌లో నేడు ఉదయం 11 గం॥లకు మోటార్ సైకిల్‌ను వేలం వేయనున్నట్లు వెదురుకుప్పం ఎస్సై గోపి పాత్రికేయులకు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా... మండలంలో నాటు సారా, ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన మోటర్ సైకిల్‌లను వేలం వేయడం జరుగుతుంది. ఆసక్తి కలవారు సదరు వేలంలో పాల్గొనవచ్చన్నారు. షరతులు వర్తిస్తాయని తెలిపారు.

శ్మశానాలు లేని గ్రామాలను గుర్తించండి

ప్రజాశక్తి-పాలసముద్రం: రెవెన్యూ కార్యాలయంలో తమ సిబ్బందికి బుధవారం తహశీల్దార్ బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు శ్మశానాలు, రోడ్ల సౌకర్యం తప్పక ఉండాలన్నారు. మండలంలో శ్మశానం లేని గ్రామాలను సర్వే చేసి లిస్టు ఇవ్వాలన్నారు. అలా లేని గ్రామాల్లో ఎక్కడైనా ప్రభుత్వ భూమిని గుర్తించి వారికి శ్మశానాలిచ్చి హద్దులు చూపించాలని తెలిపారు. జరుగుతున్న రీ సర్వే పారదర్శకంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మధుబాబు, వీఆర్వోలు శ్రీనివాసులు, శంకర్, రమణయ్య, గంగరాజు, గ్రామ సేవకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జలశక్తి శాఖ సభ్యులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర జలశక్తి శాఖసభ్యులు సుమన్, లక్ష్మీనారాయణలు బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్, జాయింట్‌కలెక్టర్ వెంకటేశ్వర్లును క్యాంపు కార్యాలయంలో కలిశారు. జిల్లాలో సోమల మండలంలోని వల్లిగట్ల గ్రామాన్ని ఎన్ఆర్ఈజిఎస్ పథకంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా వారు జిల్లాలోని సోమల మండలంలోని వల్లిగట్ల, సోమల, తవణంపల్లి, ఐరాల, బంగారుపాల్యం, యాదమర్రి మండలాల్లో చేపట్టిన అమత్ సరోవర్, వాటర్ కన్సర్వేషన్, ఉద్యానవన, పిట్, ఫార్మ్ పాండ్స్ వంటి పనులను పరిశీలించారని డ్వామా పిడి గంగాభవాని వివరించారు.

ఎంఎల్‌సి ఎన్నికల హెల్ప్ డెస్క్ పరిశీలన



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల ఉపాధ్యాయుల, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కాల్‌సెంటర్, హెల్ప్ డెస్కును బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ పరిశీలించారు. డిఆర్‌ఓ మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి 24/7 హెల్ప్‌డెస్క్ నెం.08572-242777, కాల్‌సెంటర్ నెం.1950లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, ఓటర్లు తమ సందేహాల నివత్తికి, ఫిర్యాదు నమోదు కొరకు ఈ హెల్ప్‌డెస్క్‌కు, కాల్ సెంటర్‌లకు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురం పంచాయతీ బాలఓబనపల్లి గ్రామంలో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ పరిశీలించారు. బుధవారం గ్రామంలో పలు సమస్యలపై సమీక్షించారు. ప్రధానంగా మురికి నీటి కాలువలు, దోమల బెడదతో గ్రామస్తులు అనారోగ్యానికి గురికాకుండా భూగర్భ డ్రైనేజీతో వ్యాధులను అరికట్టవచ్చన్నారు. పంచాయతీలో నాడు-నేడు పనులపై అడిగి తెలుసుకుని నిర్దేశించిన సమయంలో భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. వీధి దీపాలు, త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్, సర్పంచ్ బాబు రెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన తనిఖీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని పిల్లలకు వడ్డించి రోజూ విందు భోజనాన్ని అందిస్తున్న రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుకొచ్చేలా చూడాలన్నారు. పిల్లలకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలను అందించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రూపుదిద్దిన ఘనత కూడా జగనన్నదేనని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఎంపీపీ వెంట ఇన్‌ఛార్జి హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఓ ప్రైవేట్ కంటి వైద్యశాల మదనపల్లి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి 30 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో కొందరిని ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేసినట్టు సర్పంచ్ రెడ్డప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-పుంగనూరు: ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను పుంగనూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ఎరువులు సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణదారులు నిర్ణయించిన రేట్లకు విక్రయించాలని స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా దుకాణదారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. మండల రైతు భరోసా కేంద్రంలో సిబ్బందికి శిక్షణ సమావేశం నిర్వహించి ఈ పంట నమోదు, ఈ కేవైసీ పురోగతి చూపించాలన్నారు. ఈ పంట నమోదులో సూపర్ చెక్‌లో భాగంగా మేలుపట్ల గ్రామంలోని పంట నమోదు పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు ఇన్‌ఛార్జ్ ఏడీఏ వి.జ్యోతమ్మ, మండల వ్యవసాయ అధికారి జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగదేవతల ప్రతిష్టాపన



ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని మణేంద్రం పంచాయతీ కష్ణరాజపురం గ్రామంలో వైభవంగా నాగదేవతల ప్రతిష్టాపనను గ్రామస్తులు నిర్వహించారు. బుధవారం ఉదయం గణపతి హోమం, నవగ్రహ శాంతి హోమం, పంచామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి అభిషేకాలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ నాగదేవతల ప్రతిష్టాపనను చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.